న్యూజెర్సీ కథల పోటీలో రు150/-లు గెలుచుకున్న రచన

# సగటు మనుషులు

యర్నాగు శ్రీనివాసులు

"పక్కింట్లోంచి ఆ అమ్మాయి పెట్టే కేకలు విన్పిస్తున్నాయా?" అడిగాడు ఆనందరావ్ భార్య శాంతను.

"ఆ! విన్పిస్తున్నాయ్, రోజూ వుండేదేగా — కట్నం తక్కువిచ్చారని ఆ అమ్మాయిని హింసిస్తూ వుంటారు."

"ఆ! కేకలు రోజూ లేవు శాంతా! ప్రాణ భీతితో అరచినట్లుగా వుంది. కొంపదీసి ఆ అమ్మాయిని చంపేస్తున్నారేమో?"

"అబ్బబ్బ! మీరు మాట్లాడకుండా పడుకోండి. ప్రతి చిన్న విషయం మీకు భూతద్దంలో చూసినట్లుగా పెద్దదిగా కన్పిస్తుంది. ఈరోజు దాని మొగుడు ఎక్కువ తాగొచ్చుంటాడు. అందుకే ఎక్కువగా కొడ్తుంటాడు పడుకో" అంటూ భర్త తలను తన గుండెల్లోకి పొదువుకుని భర్త చేతిని తన మీద వేసుకుంది.

వున్నట్టుండి ఏదో గుర్తు కొచ్చినట్టుగా వెనక్కి తిరిగి చూసింది శాంత. ఈ గొడవకు ప్రక్కనే మంచం మీద పడుకున్న కూతురు కొడుకు లేచారేమోనని.

కానీ ఈ అరుపులు, కేకలు తమకేం వినవడనట్లుగ హాయిగా నిద్రపోతున్నారు ఆ చిన్నారులు.

ఒక్కసారిగా కేకలు ఆగిపోయాయి. ఇక ఏడుపు, వెక్కిళ్ళు విన్పడ్తాయనుకున్నారు. అది రోజూ మామూలే వాళ్ళకు. అతను కొడుతున్నప్పుడు ఆమె బాధలకు తట్టుకోలేక కేకలు పెట్టడం, అతను కొట్టీ కొట్టీ విసుగొచ్చి ఆపేస్తే, ఆమె కేకలు ఆగిపోయి వెక్కిళ్ళు వినవడాలి.

కానీ, ఇప్పుడు ఆ ఏడ్పూ వెక్కిళ్ళూవినబడడం లేదు. కొంపదీసి నిజంగానే చంపేశారేమో? ఆ అమ్మాయి అత్తమామలు కూడా అలాంటి వాళ్ళే. కొడుకు రాత్రి తాగొచ్చి కొడ్తే, వీళ్ళు పగలు ప్రతి పనిలో వేలెత్తి చూపించి, తిట్టీ, కొట్టీ, హింసించేవారు. ఆ అమ్మాయంటే ఆ ఇంట్లో ఎవ్వరికీ ఇష్టం లేదు. కట్నం తక్కువ తెచ్చిందన్న కక్షతో ఆమెను రోజూ సాధించేవారు.

శాంత అన్యమనస్కంగా పరుపుమీద అటూ ఇటూ కదల సాగింది. ఇంక వుండబట్టలేక భర్తతో అంది.

"లేచి పెరట్లోనుండి చూడండి ఏం జరుగుతుందో."

ఆనందరావ్ లేచి పెరట్లోకి వచ్చాడు. వాళ్ళ ఇంటికి ఈ ఇంటికి చిన్న పిట్టగోడ అడ్డం — అంతే.

ఠక్కున ఆ ఇంట్లోని లైట్లు ఆరిపోయాయి. ఆనందరావ్ ఆశ్చర్యంగా ఇంకాస్త ముందుకు పిట్ట గోడ నానుకుని చీకట్లోకి కళ్ళు చిట్లించి చూడనారంభించాడు.

నిశ్శబ్దంగావున్న ఆ చీకటి ఇంట్లో నుంచి చిన్నగా లో గొంతుకతో మాటలు విన్పించాయి. "అబ్బ వచ్చింది శనిది ఇప్పుడెలా?" అది ఆడ గొంతు. మరొక మగగొంతు విన్పించింది. "వస్తే వచ్చింది పీడ విరగడయ్యింది. రేపొద్దున ఉరేసుకు చచ్చిందని నలుగురికీ చెబితే సరి. మనమేం దాన్ని కావాలని చంపలేదుకదా? పొరపాట్న తగలకూడని చోట దెబ్బ తగిలి చచ్చింది."

ఆనందరావ్‌కు ముచ్చెమటలు పోశాయి. అతనికి చాలా భయం వేసింది. జీవితంలో అతను ఎప్పుడూ అంతగా భయపడలేదు. అది హత్య అని ఇప్పుడు తనకు తెలిసింది. ఇప్పుడు తనేం చెయ్యాలి?

హఠాత్తుగా అతని భుజంమీద చల్లగా తాకిందో హస్తం. కెవ్వున కేక వెయ్యబోయాడు. గబాలున అతని నోరు మూసి అతన్ని లోనికి తీసుకొచ్చింది శాంత.

ఆవిడ కూడా చాలా భయపడిపోయింది. కాస్త ధైర్యస్తురాలు కాబట్టి చకచక ఆలోచించ సాగింది. ఇప్పుడు తామేం చెయ్యాలి. వెళ్లి ఎవర్నన్నా లేపి ఈ విషయం చెప్పాలా? లేక పోలీసులకు రిపోర్ట్ చెయ్యాలా? ఎవర్నన్నా లేపినా, పోలీసులకు తెల్పినా లేనిపోని సమస్యలు, గొడవలు. ప్రక్కవాళ్ళతో శత్రుత్వం ఏర్పడుతుంది. కక్షతో వాళ్ళు తమనేమైనా చేస్తే? ఆ పిల్ల తమకేం చుట్టం కాదు కదా? ఆ పిల్ల ఛస్తే తమకేంటి? లేనిపోని సమస్యలు నెత్తిన వేసుకోవడం దేనికి?

ఒక నిశ్చయానికి వచ్చినట్టుగా లేచి బట్టలు బ్యాగ్‌లో సర్దసాగింది శాంత. ఆశ్చర్యంగా ఆమెను చూశాడు ఆనందరావ్. బట్టలు సర్దుతూ తన వంక చూస్తున్న భర్తతో అంది.

"ఈ రాత్రి మనం ఇక్కడలేం. మనం సాయంత్రమే ఇల్లు తాళంవేసి యాదగిరి గుట్ట వెళ్ళాం. రేపొద్దున పోలీసులు వచ్చి అడిగినా ఇదే చెప్పాలి తెల్సిందా?" అని బట్టలను సర్ది, పిల్లలను లేపి, ఇంటికి తాళంవేసి బయటకు వచ్చారు.

తెల్లవారిన తరువాత గుట్టనుండి తిరిగొస్తుంటే తమ ఇంటి దగ్గర మనుషులు గుమిగూడి వున్నారు. మూడు, నాలుగు కాకీ టోపీలు కూడా కన్పించాయి.

వచ్చి ఇంటి తాళం తీస్తుంటే, ఒక కాకీ టోపి వచ్చి అడిగింది. "ఈ ఇంట్లో వుండేది మీరేనా? ఇంత ప్రొద్దున్నే ఎక్కడికి వెళ్ళి వస్తున్నారు."

పోలీసు వంక తెల్లముఖం వేసుకుని చూశాడు ఆనందరావ్. ఇక ఆయన చెప్పలేడని తనే ధైర్యంచేసి చెప్పింది శాంత.

"నిన్న సాయంత్రం మేం ఇంటికి తాళం వేసి గుట్ట కెళ్ళాం. ఇప్పుడు తిరిగొస్తున్నాం. మాకేం తెలియదు. ఇంతకీ ఏం జరిగింది?"

"ప్రక్కింట్లో ఓ అమ్మాయి ఆత్మహత్య చేస్కుంది" అని చెప్పి వెళ్ళి పోయాడు పోలీసు.

'అలాగా' అని ఓ జాలి మొహంపెట్టి లోనికి వెళ్ళింది శాంత.

